ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 10 జూన్ 2011

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు ~ 534 265

08814 - 224747

9247104551

ఈ సంచికలో....

కొమ్మర ........... 12-04-2011

చించినాడ ...... 19-03-2011

ముమ్మిడివరం .. 17-04-2011

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-04-2011, కొమ్మర)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ కొమ్మర గ్రామంలో నా శరీరం జన్మించింది. ఇక్కడ రామాలయం పునర్నిర్మాణం చేశారు. దేవాలయాలు కొత్తగా కట్టటం కంటే పాడైపోయిన దేవాలయాల్ని తిరిగి నిర్మించటం మంచిది. ప్రతీ గ్రామంలో సీతారాముల దేవాలయాలు ఉంటాయి. కాని ప్రజలు ఎవరూ సద్వినియోగం చేసుకోవటంలేదు. ఆలయం నిర్మించటం వేరు, దానిని సద్వినియోగం చేసుకోవటం వేరు. ప్రతీ మనిషిలో మంచి ఉంటుంది, చెడ్డ ఉంటుంది. మీకు దగ్గరలో దేవాలయం ఉంటే ఉదయం కాని, సాయంత్రం కాని దర్శనం చేసుకోవటం మంచిది. అలా దర్శనం చేసుకోవటం వలన మీ మనస్సులో ఉన్న చెడ్డ తగ్గుతూ ఉంటుంది, మంచిపెరుగుతూ ఉంటుంది. హిందువుల హృదయంలో ఉన్న దేవుడు రాముడు ఒక్కడే అని, ఎక్కడ పదిమంది హిందువులు ఉంటే అక్కడ సీతారాములు ఉంటారు అని, సీతారాములను స్మరించుకోకుండా ఏ హిందువు కూడా ఉండడు అని హైదరాబాదులో ఒక సభలో వివేకానందుడు చెప్పాడు. మేము రాక్షసుల బాధ భరించలేక పోతున్నాము, మమ్మల్ని యజ్ఞాలు అవీ చేసుకోనివ్వటంలేదు, భయ పెట్టేస్తున్నారు అని ఋషులు సనత్‌కుమారునితో చెప్తారు. మీరు కొంతకాలం ఓపిక పట్టాలి. భవిష్యత్తులో మహావిష్ణువు రాముడిగా జన్మించి రాక్షస సంహారం చేస్తాడు. అప్పటివరకూ మీకు కొన్ని బాధలు తప్పవు అని సనత్‌కుమారుడు ఋషులకు చెప్పాడు. దశరథమహారాజు చేత ఋష్యశృంగుడు పుత్రకామేష్ఠి యజ్ఞం చేయించాడు. తరువాత శ్రీ ఖరనామ సంవత్సరం చైత్రమాసం, తిథి

నవమి రోజున కౌశల్య గర్భాన రాముడు జన్మించాడు. వాల్మీకి రామాయణం వ్రాసేముందు 16 మంచి గుణాల గురించి నారదుడిని అడుగుతూ ఈ పదహారు మంచిగుణాలు ఉన్నవాళ్ళు ఈ భూమిమీద ఎవడైనా సంచరించాడా అని అడిగితే, ఈ పదహారు గుణాలు రాముడిలో ఉన్నాయని నారదుడు చెప్పాడు. మీకు ఆ పదహారు మంచిగుణాలు అక్కరలేదు, ఒక మంచిగుణం ఉంటే మీరు అందరూ అభివృద్ధిలోనికి వస్తారని చెప్పాడు. రాముని చరిత్ర నారదుడు టూకీగా చెబితే, వాల్మీకి రామాయణం అంతా దర్శించి ఒకమాట చెప్పాడు. అమృతదోషం ఎలా ఉంటుందో తెలియకుండా ఈ రామాయణ కావ్యం వ్రాస్తున్నాను అని చెప్పాడు. వాల్మీకి మహా పవిత్రుడు. రామాయణాన్ని ఆదికావ్యం అంటారు. వాల్మీకిని ఆదికవి అంటారు. రాముడి గురించి వాల్మీకి మాట్లాడుతూ పూర్వభాషి అన్నాడు. ఎవరైనా కనిపిస్తే మీరు బాగున్నారా అని వారి క్షేమం గురించి ముందే పలకరిస్తాడు, వాడు రాముడు.

రాముడు రాక్షస సంహారం గురించి జన్మించినా, ఒక మానవుడిగా కనిపించి మానవుడికి ఎన్ని కష్టసుఖాలు వస్తాయో అవి అన్నీ అనుభవించి చూపించాడు. మాకు ఉన్న కష్టాలు ఎవరికీ లేవేమో అని మీరు అనుకుంటున్నారు. మీకు ఉన్న కష్టాలకంటే వందరెట్లు ఎక్కువ కష్టాలు రాముడు అనుభవించాడు. రామాయణం చదివితే మీకు తెలుస్తుంది. రాముడు ధర్మస్వరూపుడు. ధర్మమే ఒక శరీరంగా జన్మించింది. రాముడు జోలికి మనం వెళ్ళటం మంచిది కాదు, రాముడు మహాత్ముడు, మహాబలవంతుడు, అధర్మం ఎలా ఉంటుందో రాముడికి తెలియదు అని మారీచుడు రావణాసురిడికి చెప్పాడు. ధర్మం అంటే దానంకాదు. ధర్మము అంటే ఒక జీవిత విధానం. మన మనస్సుని, ఇంద్రియాలని కంట్రోలు చేసుకుని, మన మనస్సుని నిదానంగా ఉంచుకుని అధర్మం వైపుకి, అన్యాయం వైపుకి వెళ్ళకుండా జీవితం పొడుగునా న్యాయంగా జీవించటం. ధర్మం అంటే అది. మనం కూడా ఎంతో కొంత ధర్మాన్ని ఆచరిస్తున్నాము కానీ రాముడికి, మనకి తేడా ఏమిటి అంటే, మనకి ఏదైనా భయం వేసింది అనుకోండి ధర్మాన్ని వదిలేస్తాము. రాముడు ఎట్టి పరిస్థితులలోనూ వాడికి ప్రాణం పోయినా ధర్మాన్ని విడిచిపెట్టడు. వాడు రాముడు. కైకేయి దశరధుడితోటి భరతుడికి పట్టాభిషేకం చేయమని, రాముడిని 14 సంవత్సరాలు అరణ్యవాసానికి పంపాలని చెప్పింది. అప్పడు లక్ష్మణుడు చెప్పాడు పితృవాక్య పరిపాలన చెయ్యవద్దు, ధర్మాన్ని విడిచి పెట్టమని చెప్పాడు. ఎట్టి పరిస్థితులలోను ధర్మాన్ని విడిచిపెట్టను అని రాముడు చెప్పాడు. రాముడు వేరు, ధర్మంవేరు కాదు. ధర్మమే రాముడు రూపం ధరించింది. రాముడూ

అవతారపురుషుడే, కృష్ణుడూ అవతారపురుషుడే, అయితే మన మనస్సుకీ, బుద్ధికీ, మన ఇంద్రియాలకీ కృష్ణుడు అందడు. రాముడు మనకి దగ్గరగా ఉంటాడు. మన కష్టసుఖాలకి అందుతాడు. మనకి అందే దేవుడు రాముడు, మనకి అందని దేవుడు కృష్ణుడు.

శ్రీరామనవమి అంటే రాముడు పుట్టినరోజు, కానీ శ్రీరామనవమి రోజున సీతారాముల కళ్యాణం చేస్తారు. కళ్యాణం శ్రీరామనవమి రోజున ఎందుకు చేస్తారంటే శ్రీరాముడు పుట్టటమే మనందరికీ కళ్యాణప్రదం అని శ్రీరామనవమి రోజునే సీతారాములకి కళ్యాణం చేస్తారు. సీత, రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడు వీళ్ళని స్మరించుకునే అలవాటు మనకు ఎందుకు లేదు అంటే వాళ్ళని స్మరించుకోవటం వలన మన బుద్ధి శుద్ధి అవుతుంది అని మనకు తెలియక వారిని స్మరించుకోము. మనిషి పవిత్రుడు అవ్వాలి అంటే, వాడికిఏకాగ్రత రావాలి అంటే, వాడి మనస్సు నిదానంగా ఉండాలి అంటే రామనామాన్ని పట్టుకోవాలి. రైలు పట్టాలని విడిచిపెట్టకుండా ఎలా పరుగెడుతుందో అలాగే మన జీవితంలో మనం ధర్మాన్ని పట్టుకుని నడవటానికి ఒక రామనామస్మరణ తప్పించి ఇంకొక మార్గం లేదు. రామాయణంలో తత్వశాస్త్రం ఉంది, ధర్మశాస్త్రం ఉంది, గృహస్థధర్మాలు కూడా చెప్పారు, ఆత్మజ్ఞానం ఎలా సంపాదించాలో కూడా రామాయణంలో చెప్పాడు. నీకు కోపం వచ్చినా, ద్వేషం కలిగినా, భయం కలిగినా, ఎప్పడైనా అసహనం వచ్చినా, చిరాకు వచ్చినా, పరాకు వచ్చినా ఎటువంటి పరిస్థితులలో కూడా ధర్మాన్ని విడిచిపెట్టవద్దు అని వాల్మీకి రామాయణంలో చెప్పాడు.

విశ్వామిత్రుడు దశరథుడి దగ్గరకు వచ్చి, నేను యజ్ఞాలు, యాగాలు చేసుకుంటున్నాను, రాక్షసులు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారు, ఆ యజ్ఞాలు రక్షించటానికి రాముడిని పంపించమని అడిగితే, రాముడు చిన్నపిల్లవాడు నేను వచ్చి మీ యజ్ఞాలను రక్షిస్తాను అన్నాడు దశరథుడు. విశ్వామిత్రుడు అంటే సామాన్యంకాదు సృష్టికి ప్రతిసృష్టి చేసిన వాడు. గాయత్రీ మంత్రాన్ని కనిపెట్టినవాడు. విశ్వామిత్రుడు రాముడిని ఒక మంచి కోసమే పంపించమంటున్నాడు అందుచేత దశరథమహారాజా నువ్వు సందేహించనక్కరలేదు అని వశిష్ఠుడు చెబుతాడు. అప్పడు రామలక్ష్మణులని విశ్వామిత్రుడి వెంట పంపుతాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు చాలా యుద్ధ రహస్యాలు చెప్పాడు. ప్రవర్తన ఎలా ఉండాలో చెప్పాడు. రాగద్వేషాలు వేగం వచ్చినప్పడు ఎలా తట్టుకోవాలో చెప్పాడు. భవిష్యత్తులో వీళ్ళు అరణ్యవాసం చెయ్యాలి కాబట్టి ముందే గ్రహించి కింద గడ్డిపరచి దాని మీద పడుకోమన్నాడు. కౌశల్యాసుప్రజా రామా అని ప్రొద్దుటే నిద్రలేపేవాడు విశ్వామిత్రుడు. ఆ

శ్లోకం విశ్వామిత్రుడి నోటమ్మటా వస్తే అది వాల్మీకి వ్రాసాడు. ఆ శ్లోకాన్నే వేంకటేశ్వర సుప్రభాతంలో మొదటి శ్లోకంగా వ్రాసారు.

విశ్వామిత్రుడి యజ్ఞ సంరక్షణార్థం రామలక్ష్మణులు అక్కడకు వచ్చిన రాక్షసుల్ని సంహరించాలి. మొదట తాటకి అనే స్త్రీ రాక్షసి వస్తుంది. అప్పుడు రాముడు అంటాడు పురుషుల్ని చంపవచ్చునుకాని స్త్రీలను చంపటం నాకు ఇష్టం లేదు అంటాడు. రామా నువ్వు ధర్మాన్ని స్థాపించటానికి ఈ భూమి మీదకు వచ్చావు. నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి. నీ డ్యూటీ నువ్వు చేసేటప్పుడు ఆడదానిని చంపటం అశుభకర్మ కింద నీకు అనిపిస్తోంది. ధర్మం నువ్వు నిర్వర్తించవలసి వచ్చినప్పుడు అది అశుభకర్మ కింద నీకు కనిపించినా అది చెయ్యవలసిందే రామా అంటాడు. నువ్వు తాటకిని శత్రుత్వంతోటి చంపటంలేదు, కర్తృత్వంతోటి చంపటం లేదు. నీ ధర్మాన్ని నువ్వు ఆచరించటానికి చంపుతున్నావు కాబట్టి నీకు ఏమీ దోషం రాదు తాటకిని చంపు అని విశ్వామిత్రుడు చెప్పాడు. రాముడు చేసే పని విశ్వామిత్రుడు చేయగలడు కానీ నీ శరీరం ఏ పనిమీద వచ్చిందో ఆ పని నీ శరీరం ద్వారా జరగాలి రామా అంటాడు విశ్వామిత్రుడు. రామలక్ష్మణులు రాక్షసులను సంహరిస్తారు. విశ్వామిత్రుడు యజ్ఞం పూర్తి అవుతుంది. తరువాత రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మిథిలానగరం తీసుకువెడతాడు. అక్కడ శివధనుస్సు ఉంటుంది. జనక మహారాజు విశ్వామిత్రుడితోటి ఈ శివధనుస్సును ఎవరైతే విరుస్తారో వారికి మా సీతమ్మను ఇచ్చి వివాహం చేస్తాను అని చెబుతాడు. ఆ శివ ధనుస్సును పూర్వం ఎందరో మహారాజులు ఎత్తలేక ఓడిపోయారు. ఆ శివధనుస్సును నేను ఎత్తుతాను అని రాముడు అనలేదు, కామ్‌గా కూర్చున్నాడు. గురువైనటువంటి విశ్వామిత్రుడు ఆ శివధనుస్సును ఎత్తు అని చెప్పినప్పుడు రాముడు ఆ శివధనుస్సును ముట్టుకొనేటప్పటికి అది విరిగిపోయింది. అప్పుడు నీకు సీతమ్మని ఇచ్చి పెళ్ళి చేస్తాను అంటున్నాడు నీకు ఇష్టమేనా అని విశ్వామిత్రుడు అడుగుతాడు. నాకు సీతమ్మ ఇష్టం అని చెప్పలేదు. నా తండ్రిగారికి ఇష్టమయితే నాకు ఇష్టమే అన్నాడు. అదీ రాముడు యొక్క వైభవం. రాముడికి కౌశల్య మీద ఎంత ప్రేమ ఉందో, ఎంత ఆప్యాయత ఉందో సుమిత్ర మీద, కైక మీద కూడా అంతే ప్రేమ, ఆప్యాయత ఉంది. కైక మీద రాముడికి కొంచెము కూడా ద్వేష బుద్ధి కలగలేదు.

సహనం వలన మనం ఏదైనా సాధించవచ్చుగాని, అసహనం వలన ఏదీ సాధించలేము. మీరు ఈశ్వరుడు ప్రీతికోసం పని చేస్తూ ఉంటే ఈశ్వరుడు మీకు మంచి

బుద్ధి కలుగజేస్తాడు. మీరు ఈశ్వరుడు ప్రీతికోసం పనిచేస్తే మిమ్మల్ని బాగుపడమని చెప్పడు కాని మీకు బాగుపడేలక్షణాలు కలుగజేస్తాడు. మీకు బాగుపడే బుద్ధి కలుగజేస్తాడు. మీరు చేసేపని కలిసివచ్చేలా చేస్తాడు అది ఈశ్వరుని దయ. మీకు మంచి తలంపులు వస్తూ ఉంటే, మంచి పనులు చెయ్యాలనే బుద్ధి కలుగుతూ ఉంటే, ఆత్మజ్ఞానం సంపాదించాలనే తపన మీకు కలుగుతూ ఉంటే మీకు ఈశ్వరుని దయ ఉన్నట్టే. భగవాన్ అన్నారు మీరు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి లేకపోతే శ్వాసమీద ధ్యాస పెట్టండి, నిష్కామకర్మ చెయ్యండి వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఒక్కటే. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలూకా గ్రహింపు నీ బుద్ధికి అందటానికే ఈ కర్మలు అన్నీ అన్నారు. నిన్ను నువ్వు తెలుసుకోవటానికే. నిన్ను నువ్వు తెలుసుకున్నాక ఏమనిపిస్తుంది అంటే అంతకుముందు నువ్వు చేసిన సాధన చూచి నీకే సిగ్గేస్తుంది. సముద్రంలో ఎంత నీరు ఉందో నీ హృదయంలో అంత ఆనందము ఉంది. ఆ ఆనందము నీకు అనుభవంలోనికి వచ్చాక నిన్ను చూచి నీకే ఆశ్చర్యము వేస్తుంది. మీరు ఆత్మని శరీరం అనుకుంటున్నారు. ఆత్మని మనస్సు అనుకుంటున్నారు, ఆత్మని బుద్ధి అనుకుంటున్నారు, ఆత్మని ప్రాణం అనుకుంటున్నారు. ఇవన్నీ జడవస్తువులు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అది చైతన్యము. చైతన్యానికి మించిన వస్తువు కాని, దానికి సమానమైన వస్తువుకాని లేనేలేదు. ఆ చైతన్యం ఎవరోకాదు, అది మీ స్వరూపమే. నీ స్వరూపమే ఆనందం, నీ స్వరూపమే ఉండటం. అది నీకు అనుభవంలోనికి రావటానికే ఈ యజ్ఞాలు. సత్‌కర్మలు నిష్కామంగా చేయటం, అర్చనలు, అభిషేకాలు, ఈ దేవాలయ నిర్మాణాలు ఇవన్నీ నువ్వు ఎవరో నువ్వు తెలుసుకోవటంకోసమే. ఇది రమణ సిద్ధాంతం.

ధర్మాన్ని ఆచరించకుండా మనోనాశనం అవ్వదు. నువ్వు ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే ధర్మం నీ మనస్సుని శుభ్రంగా పిండిచేసి పడేస్తుంది. ధర్మం అంటే దైవం. ఆ దైవమే మీ మనస్సుని నాశనం చేసిపెడుతుంది. మీకు ధర్మాన్ని ఆచరించటం మీద నమ్మకం లేకపోతే నేను ఎవడను అనే విచారణ వల్ల కూడా మీ మనస్సు నశిస్తుంది. ధర్మాన్ని ఆచరించినా మీకు తెలియకుండా మనోనాశనం అయిపోతుంది. మీకు మనోనాశనం కాకుండా ఆత్మానుభవం కలగదు. ఆనందసామ్రాజ్యానికి అధిపతి అవ్వలేరు. మనకి ఆత్మజ్ఞానం రాకుండా అడ్డుపడే బంధాలు 1. రూపము, 2. నామము. ఇవి తప్పించి ఏమీ లేదు. కటికి చీకటి ఈ రూపబుద్ధీ, నామబుద్ధే. ఇవే మనిషిని బంధించేవి, మనస్సుని అంతర్ముఖం కాకుండా చేసేవి. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నప్పుడు ఆ డార్క్‌నెస్‌లోంచి బయటకు రాలేడు అసలు ఆ

వెలుగును తన కళ్ళతోటి చూడలేడు. మానవుడు ఏ పని చేసినా వాడి రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకుంటూ ఉంటాడు. ఒకవేళ మీరు మంచి పనులు చేసినా దాని వెనకాల మీకు ప్రేరణ ఉండేది ధర్మం కాదు. మీరు ధర్మాన్ని ఆచరించటం కోసం చేస్తున్నామని అనుకుంటారు. అనుకునేది ఒకటి, జరిగేది ఒకటి. మీ రూపబుద్ధి, నామబుద్ధి వలన ఆ పని చేయాలని మీకు ప్రేరణ కలుగుతుంది కాని దైవం మటుకు కాదు. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నంతకాలం మీకు ఆత్మజ్ఞానం కలుగదు.

రాముడు ఎటువంటివాడో మీకు అర్థం అవ్వాలి అంటే భక్తి యోగంలో చివరి 12 శ్లోకాలు చదివితే అవన్నీ రాముడికి ఉన్న గుణాలే. కృష్ణుడు నోటితో చెప్పాడు. రాముడు ఆచరించి చూపాడు.

**అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః**

**సర్వారమ్భ పరిత్యాగీ యోమద్భక్తస్సమే ప్రియః (12-16)**

**అనపేక్ష :-** అపేక్ష ఎలా ఉంటుందో తెలియనివాడు. ఇది భక్తుడి లక్షణం. రాముడు దేనికీ ఎదురుచూడడు. మీరు కూడా మీ పని మీరు చేసుకోండి. మీ ప్రారబ్ధాన్ని బట్టి వచ్చేది వస్తుంది, రానిది రాదు. దేనికోసం ఎదురుచూడకండి. మీరు ఈ భక్తిగుణాలు సంపాదిస్తే మీరు రాముడితోటి సమానం అవుతారు. మానవుడు రాక్షసుడు అవ్వకూడదు, మానవుడు దేవుడు అవ్వటానికే వాల్మీకి రామాయణం రాశాడు. ప్రపంచంలో ఎవడు తప్పు చేసినా మమకారం కోసమే చేస్తాడు. నువ్వు నీ చేతిలో ఉన్న పని శ్రద్ధగా, భక్తిగా చెయ్యి. నీకు ఆ ఫలితం అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. ఏదీకూడా ఎక్స్‌పెక్టేషన్ పనికిరాదు. ఎక్స్‌పెక్టేషన్ ఉన్నవాడికి డిజప్పాయింట్‌మెంట్ వస్తుంది కాని ఎక్స్‌పెక్టేషన్ లేనివాడికి డిజప్పాయింట్‌మెంట్ లేదు. అందుచేత నువ్వు అపేక్ష లేకుండా పని చెయ్యి అన్నాడు పరమాత్మ.

**శుచిః :-** నీ శరీరం శుచిగా ఉండాలి, నీ మనస్సు శుచిగా ఉండాలి. దేవుడి తరువాత దేవుడితో సమానమైన ప్రాముఖ్యత శుచికి ఉండాలి. నీ శరీరాన్ని ఎంత శుచిగా ఉంచుకుంటావో అలాగ నీ మనస్సు కూడా అంత శుచిగా ఉండాలి. **దక్షః :-** మీరు అమాయకత్వంగా ఉండకూడదు. వ్యవహారాల్లో దక్షతగా ఉండాలి. కొంతమందికి వ్యవహారం ఎలా పరిష్కరించాలో ఆ తెలివితేటలు ఉంటాయి, వాడిని దక్షుడు అంటారు. కొంతమంది డాక్టర్లు సర్జరీ ఎంత బాగా చేస్తారు అంటే అసలు ఆ ముఖం కూడా నలగదు. అంత స్వచ్ఛముగా

చేస్తారు. అందుచేత మీరు చేత్తోటి చేసేపనిలో కూడా దక్షత ఉండాలి. కొంతమంది సమస్యలు వస్తే భయపడతారు. సమస్య వచ్చినప్పుడు మనం ఫేస్ చెయ్యాలి కాని భయపడకూడదు. అది ఎలా పరిష్కరించుకోవాలో దానికున్న తెలివినే దక్షః అన్నారు.

**ఉదాసీన:-** ఎవరైనా ఇద్దరు దెబ్బలాడుకుంటూ ఉంటే వాళ్ళకి ఎందుకు పేచీ వచ్చింది, ఆ పేచీకి కారణం ఏమిటి? ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అది అర్థం చేసుకుని మీరు పరిష్కారం చెయ్యాలికాని, ఏమీ అర్థంచేసుకోకుండా ఎవడో ఒకడి తరఫున కలబడి పోవటం తప్పు అని కృష్ణుడు చెబుతున్నాడు. భక్తులు లోకవ్యవహారాలలోకి ఎక్కువ వెళ్ళకూడదు. లోక వ్యవహారాలలోకి ఎక్కువ వెడితే దేహాభిమానం పెరిగిపోతుంది. అతి పనికిరాదు. **గతవ్యధః-** మీరు అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకుని బాధపడితే మీకు సుఖం లేదు. మీ చేతిలో ఉన్న వర్తమానకాలం వెళ్ళిపోతుంది. మీరు సాధన వర్తమానకాలంలో చెయ్యాలి. మీరు వర్తమానకాలంలోనే బాగుపడాలి. ఈ వర్తమానకాలం వదిలేసి అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకుని ఏడుస్తూ కూర్చోకండి మీరు పాడైపోతారు అని భగవంతుడు చెబుతున్నాడు. **సర్వఆరంభపరిత్యాగీ :-** మీరు ఏ పని చేసినా కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా, రాగద్వేషాలు లేకుండా, వ్యక్తిభావన లేకుండా పని చెయ్యండి. అది మిమ్మల్ని అంటదు. అది మీ పునర్జన్మకు కారణం అవ్వదు.

రాముడు మితభాషి, హితభాషి, ప్రియభాషి. రాముడు పూర్వభాషి కూడా అన్నాడు వాల్మీకి అంటే ఎదుటి వాళ్లు పలకరించకుండా ముందు రాముడు పలకరిస్తాడు. మనం ఏమి చేస్తామంటే ఎదుటి వాళ్ళు పలకరించకుండా ముందు మనం పలకరించము. వాళ్ళకు ఏమీ తెలియదు అనుకుంటాము ఎందుకంటే మనకు ఏమీ తెలియదు కాబట్టి అన్నీ తెలుసును అనుకుంటాము. సోక్రటీసుని మీకు ఆశ్రమం లేకపోయినా మిమ్మల్ని చూడటానికి చాలామంది ఎందుకు వస్తున్నారు అని ఒకరు అడిగారు. సోక్రటీసు ఏమని చెప్పాడంటే నాకు ఏమీ తెలియదు. నాకు ఏమీ తెలియదు అన్న సంగతి కూడా నాకు తెలుసు. అందుకు నన్ను చూడటానికి అందరూ వస్తున్నారని సోక్రటీసు చెప్పాడు. ఎక్కువ మంచితనం ఉంటే లోకం భరించలేదు. అబ్రహాంలింకన్‌ని కాల్చి చంపింది, మహాత్మాగాంధీని కాల్చి చంపారు, సోక్రటీసుని విషం పెట్టిచంపారు. సోక్రటీస్‌కి ఇంకో గంటకి విషం పెడతారనగా ఈ భక్తులు అందరూ వెళ్ళి ఆ జైలు తలుపులు కొట్టేసి సోక్రటీసుతో మనం పారిపోదాం అంటారు. వాళ్ళు విషం

పెట్టి చంపుతున్నారు అనుకోనక్కరలేదు నాకు చనిపోయే టైము వచ్చింది కాబట్టి ఈశ్వర సంకల్పం ప్రకారం నేను చనిపోతున్నాను. మీరు ఇంకా కొంతకాలం ఈ భూమి మీద బతకవలసి ఉంది, మీరు సుఖంగా బతకండి అని సోక్రటీసు చెప్పాడు.

ప్రతీమనిషికి శత్రువులు ఉంటారు, మిత్రులు ఉంటారు కొంతమంది మన క్షేమం కోరేవాళ్ళు ఉంటారు, కొంతమంది మన పతనం కోరేవాళ్ళు ఉంటారు. ఇది సహజం, ఇది ప్రకృతి. కానీ మీకు బయట ఉన్న శత్రువుల వల్ల పెద్ద ప్రమాదంలేదు. మీకు లోపల ఉన్న శత్రువుల వల్లే ఎక్కువ ప్రమాదం. కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలు ఇవి అందరి మనస్సులో ఉన్నాయి. ఇవి మన లోపల ఉన్న శత్రువులు. మీకు లోపల ఉన్న శత్రువులు తీసుకువచ్చినంత ప్రమాదంలో వందో వంతు కూడా బయటి శత్రువులు తీసుకురాలేరు అని భగవంతుడు చెప్పాడు. లోపలి శత్రువులే మిమ్మల్ని జన్మజన్మలకీ పీడించేస్తున్నాయి లోపల శత్రువులను మీరు జయిస్తే అసలు బయట శత్రువు అనేవాడు మీకు కనబడడు. **తుల్యనిందిస్తుతిర్మౌనీ** :- కొంతమంది నిన్ను పొగుడుతూ ఉంటారు, కొంతమంది నిన్ను విమర్శిస్తూ ఉంటారు. ఆ మాటలను నువ్వు లోపలకు తీసుకోవద్దు. బయట గొడవలు బయట వదిలేయమని పరమాత్మ చెబుతున్నాడు. విమర్శలకు కారణం అసూయ. మనల్ని పొగడటం వలన మనకి వచ్చేది ఏమీ లేదు. విమర్శించటం వలన ఉన్నది ఏమీ పోదు. నిన్ను పొగిడేవాళ్ళు పొగుడుతూ ఉంటారు, తిట్టేవాళ్ళు తిడుతూ ఉంటారు. ఇది లోకం. లోకం అంటే కుక్క తోక లాంటిది. అవేమీ నువ్వు పట్టించుకోవద్దు. **స్థిరమతి :-** బుద్ధి స్థిరంగా ఉండాలి. కొంతమంది రోజుకో రకంగా ఉంటారు. వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో వాళ్ళకే తెలియదు. రోజుకోరకంగా ఉండకండి అంటే ఎటు గాలి వీస్తే అటు వెళ్ళిపోయేటట్టు ఉండకూడదు. బుద్ధి నిర్మలంగా ఉండాలి, బుద్ధి నిదానంగా ఉండాలి. మిమ్మల్ని ఎవరో బాగుచేస్తారు అనుకుంటున్నారు, మిమ్మల్ని ఎవరూ బాగు చేయరు. మీ బుద్ధే మిమ్మల్ని బాగు చేస్తుంది, మీ బుద్ధే మిమ్మల్ని పాడు చేస్తుంది. అందుచేత మీ బుద్ధి విషయంలో అజాగ్రత్తగా ఉండకండి. స్థిరబుద్ధి సంపాదించుకోండి. ఏ వస్తువు మీద అయితే మీ బుద్ధిని నిలబెట్టారో అక్కడ మీ బుద్ధి నిలబడి ఉండాలి. బుద్ధి చలించకూడదు. బుద్ధికి జ్ఞాపకశక్తి పెరగాలి కాని జ్ఞాపకశక్తి తగ్గకూడదు. మీరు మంచి విషయాలు శ్రవణం చేసి అవి మర్చిపోకుండా మీ బుద్ధిలో మననం చేసుకోవాలి. మీ శరీర ఆరోగ్యానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో మీ బుద్ధికి కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వండి. మీకు బుద్ధి నిర్మలంగా ఉండాలంటే

రెండే మార్గాలు. 1 నిరంతరం దైవధ్యానం, 2 నిరంతరం ఆత్మధ్యానం. ఆత్మ అంటే చైతన్యము. చైతన్యానికి రూపంలేదు. నిరంతరం ఆత్మని ధ్యానించటం వలన బుద్ధి నిర్మలం అవుతుంది. దైవాన్ని అంటే రాముడినో, కృష్ణుడినో నిరంతరం ధ్యానించటం వలన కూడా బుద్ధి నిర్మలమవుతుంది. మీకు ఏమార్గం ఇష్టం అయితే ఆ మార్గంలో ప్రయాణం చేసి తరించండి.

రామనామ స్మరణ చేసుకునేవాడు పవిత్రుడు అవుతాడు. పరమపవిత్రుడు కాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు. రాముడు అంటే రంజింప చేసేవాడు, రాముడు అంటే జ్ఞాన స్వరూపుడు. మీరు రామనామం చేసుకుంటే రాముడు మనకి ధనాన్ని ఇస్తాడు, గుణాన్ని ఇస్తాడు. ఆ ధనాన్ని, గుణాన్ని సద్వినియోగం చేసుకుంటే జ్ఞానాన్ని ఇస్తాడు. రాముడు సర్వ సమర్థుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-03-2011, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదముల యొక్క సారమే భగవద్గీత. భగవద్గీత మీ జేబులో ఉంటే నాలుగు వేదములు మీ దగ్గర ఉన్నట్లే. భగవద్గీత సమగ్రమైన గ్రంథం. మనం చైతన్యస్థాయిని అందుకోవటానికి అన్ని కోణాల్లోంచి భగవద్గీతలో ప్రతిపాదనలు ఉన్నాయి. మమ్మల్ని భగవద్గీత ఎప్పుడైనా చదవమంటారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. ఎప్పుడైనా కాదు, మీకు అవకాశం ఉంటే ఎప్పుడూ చదువుకోండి అన్నారు. మన హిందువులు ఎక్కువగా భగవద్గీత పారాయణ చేస్తారు. మనం చెయ్యవలసిన పనులు, చెయ్యకూడని పనులు గురించి గీతలో వివరంగా చెప్పారు. మనం ఎలాగ మాట్లాడాలి, మనం ఎలాగ పనిచేస్తే మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం అలవడుతుందో ఇవన్నీ గీతలో ప్రతిపాదించారు. నీచేతిలో ఉన్న పని నువ్వు చెయ్యాలి. ఆ పని జరగవచ్చు, జరగకపోవచ్చు. జరిగిందని సంతోషపడకూడదు. ఆపని జరగలేదని మనం డిప్రెషన్‌లోనికి వెళ్ళకూడదు. ఆపని అలా జరగకపోవటానికి కారణం కేవలం మన సోమరితనం కాదు, మన తెలివితక్కువతనం కాదు, మనం కష్టపడి పనిచేసినా, డెడికేటెడ్‌గా పనిచేసినా ఒకోసారి రిజల్ట్ మనకి అనుకూలంగారాదు. ఒకోసారి ఆ పని జరిగినా మన తెలివితేటల వలన జరగలేదు. అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి అలా జరిగింది. నేను తెలివైన వాడిని, నేను తెలివితక్కువ వాడిని, నేను అది సాధించాను, ఇది సాధించాను, అది సాధించలేకపోయాను, ఇది సాధించలేకపోయాను అని నువ్వు అనుకుంటున్నావు అంటే భగవంతుడి సంకల్పానికి భిన్నంగా నువ్వు ఏదో చెయ్యాలని అనుకుంటున్నావు. అది